## పటాన్‌చెరు-సికింద్రాబాద్ 219 బస్సు వేళలు

రాయదుర్గం: హెచ్‌సీయూ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సును పటాన్‌చెరు నుంచి సికింద్రాబాద్ వరకు షటిల్ బస్సుగా నడిపిస్తున్నారు. ఉదయం 5గంటలకు ప్రారంభమవుతుంది. కనీసం ప్రతి 10 నిమిషాలకో బస్సును నడపాలని నిర్ణయించారు. ఈ బస్సు పటాన్‌చెరులో బయలుదేరి ఇక్రిశాట్, ఆర్‌సీపురం, బీరంగూడ, అశోక్‌నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్‌రోడ్, మియాపూర్, హైదర్‌నగర్, నిజాంపేట్ ఎక్స్‌రోడ్, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, వై జంక్షన్, బాలానగర్ ఎక్స్‌రోడ్, శోభన థియేటర్, బోయిన్‌పల్లి ఎక్స్‌రోడ్, తాడ్‌బండ్, ప్యాట్నీ సెంటర్ మీదుగా సికింద్రాబాద్ వరకు నడుస్తుందని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి కోరారు.

## కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 50, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 35, చిక్కుడు 40, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20 , సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 350.

## ఘనంగా రథసప్తమి

రాయదుర్గం: రథసప్తమిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో మంగళవారం పూజలు నిర్వహించారు. ఆలయంలో రాజశ్యామల యాగం, సూర్య, గాయత్రి, రుద్ర నవగ్రహ హోమాలను భక్తి శ్రద్ధలతో చేశారు. గణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, ఆంజనేయస్వామికి అభిషేకం, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కార్పొరేటర్ పుష్ప జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అనేక కాలనీలలో ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు ఆయనకు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ వి.సింధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ మ్యాక్ సొసైటీ కాలనీలోని శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వి.సింధూ రెడ్డి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు నందగోపాల్, మధుసూదన్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీలత, రజిత, నాయకులు సుధాకర్, వెంకట్‌రెడ్డి, విజయ్, రాకేష్‌లు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లోని డబుల్ ఇళ్లను స్థానికులకే ఇవ్వాలి

కమిషనర్‌కి సీపీఎం నాయకుల వినతి



కమిషనర్ జ్యోతిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు: సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఎం నాయకులు నర్సింహారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, పెన్షన్ల కోసం పేదలు ఎదురుచూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం కంటే పెన్షన్లు పెంచి ఇస్తామన్న ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. అమీన్‌పూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లను మున్సిపల్ పరిధిలోని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏది పడితే అది డంప్

## జీహెచ్‌ఎంసీ స్థలం ఆక్రమణకు యత్నం



చందానగర్ డివిజన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 21 కార్యాలయం వెనుక ఉన్న డంపింగ్ స్థలంపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. ప్రహరీ పూర్తి స్థాయిలో లేకపోవడంతో భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్, చెత్త చెదారం వేస్తున్నారు. పైగా కొందరు జీహెచ్‌ఎంసీ స్థలాల్లో ఇసుక, కంకర డంప్ చేసి వ్యాపారం చేస్తున్నారు. మరికొందరు వీధి వ్యాపారులు వ్యాపారానికి సంబంధించిన సామగ్రిని డంప్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులు పడుతున్నారు.



– చందానగర్





చందానగర్ సర్కిల్ కార్యాలయం వెనుక ఉన్న జీహెచ్‌ఎంసీ స్థలంలో గేటును తొలగించిన దృశ్యం... చెత్తాచెదారం

## బస్టాప్‌ను పునరుద్ధరించాలని వినతి

మియాపూర్: దీప్తిశ్రీనగర్ కాలనీ వద్ద బస్టాప్‌ను తొలగించడంతో ఇబ్బందిపడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మియాపూర్ మదీనాగూడ జాతీయ రహదారిపై దీప్తిశ్రీనగర్ కాలనీ వద్ద ఉన్న బస్టాప్‌ను తొలగించివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని పునరుద్ధరించాలంటూ చందానగర్ సర్కిల్-21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి కాలనీవాసులు వినతి పత్రం అందించారు. ఎండాకాలం సమీపిస్తుండడంతో ఎండకు నిలబడలేమని వివరించారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

## సర్కిల్ పరిధిలో ప్రజాపాలన దరఖాస్తులు 796

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రజాపాలన కేంద్రాల్లో 796 దరఖాస్తులు వచ్చాయని మంగళవారం అధికారులు తెలిపారు. సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్ల వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ డివిజన్‌లో 529 దరఖాస్తులు, గచ్చిబౌలి డివిజన్‌లో 19, శేరిలింగంపల్లి డివిజన్‌లో 248 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి తెలిపారు. గతంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోని వారు మళ్లీ ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



చందానగర్: మాతృశ్రీనగర్, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 వరకు మాతృశ్రీనగర్ కొంత భాగం, టెంపుల్ పార్క్, విజేత సూపర్ మార్కెట్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- మాధవనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి సాయంత్రం 6.00 వరకు మాతృశ్రీనగర్ కొంత భాగం, ఎస్‌బీఐ బ్యాంక్, మాధవనగర్ కొంత భాగం ఏరియాలలో ..
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, వార్డు కార్యాలయం, గ్రీన్ బావర్చి, సాయినగర్, యూత్ కాలనీ ప్రాంతాలలో...
- ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు ఆదిత్యనగర్, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్, ఎస్‌సీబీ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ ఏరియా మొత్తం విద్యుత్ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: కొండాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్.రంగారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రశాంత్‌నగర్, కొండాపూర్, జూబ్లీగార్డెన్, గోల్డెన్ తులిప్, రాఘవేంద్ర కాలనీ ఏ,బీ,సీ బ్లాక్‌లు, రాజరాజేశ్వరి కాలనీ, హనుమాన్‌నగర్, సైబర్‌వ్యాలీ, గోపాల్‌రెడ్డి నగర్, అపర్ణా గేటెడ్ కమ్యూనిటీ, హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా 11కేవీ ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను బుధవారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపన్‌పల్లి తండా, ఎన్‌టీఆర్ నగర్, తాజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

## రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



రాయదుర్గం: నానక్‌రాంగూడ రంగ్‌బాగ్‌లోని రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో మొదటిరోజు ఉదయం బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అంకురార్పణతో ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శరద్ బి పిట్టి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అంజయ్య, భక్తులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్ పేరుతో సైబర్ మోసం

రూ.25 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: స్టాక్ మార్కెట్ పేరిట ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ వేసి భారీగా నగదు కాజేశారు సైబర్ కేటుగాళ్లు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్‌ఎంటి స్వర్ణపురి కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గత ఏడాది డిసెంబర్ 1న వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశారు. దీంతో అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి, నగదు ఇన్వెస్ట్ చేయిస్తూ వచ్చారు.పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం రూ. 25 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. దీంతో బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితులు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, మంగళవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న మల్లన్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు ఉదయమే గంపలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సిద్ధం చేసి సమర్పించారు. బోనాల ఉత్సవాల్లో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.వేణుగౌడ్, వైస్ ఛైర్మన్ కె.దశరథయాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓం ప్రకాశ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతాన్ని సంరక్షించాలి

జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని మంగళవారం జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా బొంతపల్లి అర్బన్ పార్క్, మంబాపూర్ ప్రాంతాలను పరిశీలించారు. మంబాపూర్ ప్రాంతంలో అర్బన్ పార్క్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అడవిని సంరక్షించేలా నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని స్థానిక అటవీ అధికారులకు సూచించారు.

## క్యాన్సర్ రోగుల ఇంటికెళ్లి చికిత్స అందిస్తాం



క్యాన్సర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కూకట్‌పల్లి: క్యాన్సర్ రోగులు ఆసుపత్రికి రావాలంటే కొన్నిసార్లు ఇబ్బంది పడతారని, అందుకు తామే నేరుగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి కొన్ని రకాల చికిత్సలు అందించనున్నామని అమోర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ బి.రెడ్డి తెలిపారు. లాస్ట్ మైల్ సర్వీస్ అనే సేవా కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ప్రపంచ క్యాన్సర్ నివారణ డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన వాక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తగిన అవగాహన, వీలైనంత త్వరగా గుర్తించడం ద్వారా క్యాన్సర్‌ను జయించగలమన్నారు. వాకర్స్ అందరూ క్యాన్సర్ అవగాహన ప్లకార్డులు, బ్యానర్లతో నడిచారు. పలు ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, పరిసర ప్రాంత వాసులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

గచ్చిబౌలి: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ నిర్వహిస్తున్నట్లు కొండాపూర్ ఈడీఈ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6న ఉందయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సమావేశం ఉంటుందన్నారు. జీసీఆర్‌ఎఫ్, టెక్నికల్, ఫైనాన్స్, కన్జ్యూమర్ మెంబర్లు హాజరవుతారని తెలిపారు. వినియోగదారులు దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలు, బిల్లులలో హెచ్చుతగ్గులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

## 12 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ.1500 జరిమానా, మరో ఐదుగురికి రూ. 1000, మరో వ్యక్తికి రూ.2 వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూములను కాపాడి ప్రజల అవసరాలకు ఉపయోగించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం బాచుపల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, సంతోష్ కుమార్, సుమన్‌రావు, దాసి నాగరాజు, పద్మ ప్రసాద్ పాల్గొన్నారు.

## శాంతి కల్యాణం

శంషాబాద్ రూరల్: నర్కూడ శివారులోని అమ్మపల్లి (సీతారామచంద్రస్వామి) ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

# దేశాభివృద్ధే ప్రధాని లక్ష్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: దేశాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కార్య వర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. మంగళవారం మసీదుబండలోని కూడలిలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజారంజకమైందన్నారు.కేంద్రం ప్రవేశపెట్టిన 95 శాతం పథకాలు తెలంగాణకు లబ్ధి చేకూరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగులుగౌడ్, ఎల్లేష్, ఆంజనేయులు, కిషోర్, లక్ష్మణ్,మాణిక్‌రావు, రమణయ్య, సత్యనారాయణ, శ్రీశైలం, వెంకటస్వామి, రమేష్,శ్రీనివాస్‌యాదవ్,రవినాయక్, రాజు,గణేష్,శివారెడ్డి,బాబుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, జలకన్య సర్కిల్‌లో మంగళవారం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మకమైన నిర్ణయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎత్తరి రమేష్, సీనియర్ నాయకులు నరసింహాచారి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ మణిభూషణ్, నాయకులు కమలాకర్‌రెడ్డి, ఆర్‌కే చారి, విష్ణు, ఆంజనేయులు యాదవ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మసీదుబండలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నాయకుడు రవికుమార్‌యాదవ్, పార్టీ శ్రేణులు

# ఎల్లమ్మ చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మ చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా గుర్రపుడెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రపు డెక్క తొలగింపు పనుల్లో వేగం పెంచాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ మురుగు నీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతులు, చెరువుకట్ట బలోపేతం, పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ పనులు చేపడతామన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ సభ్యులు

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ ఛైర్మన్ గాంధీని కలిశారు. ఆయన వారిని సన్మానించి మాట్లాడారు. కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు చీఫ్ ప్యాట్రన్ రామకోటేశ్వరరావు, మెంబర్లు బాబురావు, యాదిరెడ్డి, రాజు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## భెల్ టౌన్‌షిప్‌లో డప్పు ర్యాలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నగరంలో ఈనెల 7వ తేదీ జరగనున్న 'లక్ష డప్పులు.. వేల గొంతుల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బీహెచ్‌ఈఎల్ మాదిగ ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం భెల్ టౌన్‌షిప్‌లో డప్పు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంఈఎఫ్ అధ్యక్షులు దేవేందర్, భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాబు జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భెల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి నరేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు గంగాధర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న ఉద్యోగులు

## బిల్లులు వెంటనే చెల్లించాలి

శంషాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కార్మికులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేష్ మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. నెలకు ఇచ్చే వేతనాలు కూడా నిలిచిపోయాయన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం నాయకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్



రాజేంద్రనగర్: దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సౌత్ జోన్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దోమల నియంత్రణ కోసం అత్తాపూర్ నుంచి బుద్వేల్ వరకు మూసీ కాలువలో డ్రోన్ ద్వారా యాంటీ లార్వాను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ. డ్రోన్‌తో ఒక్క రోజులోనే లార్వా పిచికారీ సాధ్యమవుతుందన్నారు.